తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





చిరుజల్లుల నడుమ....

# గరుడునిపై మలయప్ప దివ్యమంగళరూపం



తిరుమల, అక్టోబర్ 9 ప్రభాతవార్తప్రతినిధి:

నిండుపున్నమివేళ....ఏడుకొండల్లో చిరుజల్లులు కురుస్తుండగా చలిగాలుల నడుమ జగన్నాటకసూత్రధారి శ్రీవేంకటేశ్వరుడు రెండవసారి ఆదివారం రాత్రి గరుడునిపై భక్తులను కటాక్షించారు. సాయంత్రం స్వామివారు విశేషఅలంకారభూషితుడై గరుడుని అధిరోహించాడు. సాయంసంధ్యవేళ చిరుజల్లులు పడుతుండగా భక్తుల గోవింద నామస్మరణల మధ్య ఈనెలలో రెండవసారి గరుడవాహనంపై మలయప్ప భక్తజనానికి దర్శనమిచ్చాడు.

## మహాఛండీ యాగంలో మంత్రి రోజా

తిరుపతి, అక్టోబర్ 9ప్రభాతవార్త:



పౌర్ణమి ఘడియల్లో ఆదివారం ఉదయం తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శాస్త్రోక్తంగా మహా చండీయాగం జరిగింది. ఉదయం ఆలయం ఆవరణలో ఆలయ అర్చకులు వైభవంగా ఈ యాగం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి ఆర్‌కె రోజా, నగరపాలక సంస్థ ఉప మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, తుడ కార్యదర్శి లక్ష్మి, గృహస్థ భక్తులు పాల్గొనగా ఆలయ ఛైర్మన్ గోపీయాదవ్, ఇఓ ఎం.మునికృష్ణయ్య, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి రోజా ఆలయంలోనికి చేరుకుని గంగమ్మను దర్శించుకుని కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ జగన్ ప్రభుత్వం

## చిత్తూరు రూరల్ మండలంలో అభివృద్ధి పనులకు ప్రారంభం -రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి

చిత్తూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా సీఎం జగన్.. వైఎస్ జగన్ ప్రభుత్వం అని రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం చిత్తూరు రూరల్ మండల పరిధిలో మంత్రి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్.బాబులతో కలసి పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ మెల్త్ క్లీనిక్‌లను ప్రరంభించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల కష్ట సుఖాలను తెలుసుకోవడానికి వారి సమస్యలను పరిష్కరించడానికి సీఎం జగన్ గడప గడపకు మన ప్రభుత్వం శ్రీకారం చుట్టారన్నారు. ఈకార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి ప్రభుత్వమే స్వయంగా వెళ్ళి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమం దేశంలోనే ఎక్కడా జరగలేదన్నారు. ప్రజలు గతంలో సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రభుత్వ కారా ్యలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే వారని ప్రస్తుతం సీఎం గ్రామ సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చి క్షేత్రస్థాయిలోనే సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారన్నారు. అలాగే డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్న నిధులు దేశంలోని ఏరాష్ట్రంలో ఖర్చు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాల అమలులో అవినీతికి అస్కారం లేకుండా నిధులను నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకే జమ చేసిన చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దకు ్కతుందన్నారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ వైపు చూసే విధంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. దేశంలోని మిగిలిన రాష్ట్రాల కంటే అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఈకార్యక్రమంలో చుడా ఛైర్మన్ పురుషో త్తంరెడ్డి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ బుల్లెట్ సురేష్, డిప్యూటీ మేయర్‌లు, ఆర.చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డిలు, జడ్పీ వైస్ ఛైర్మన్‌లు ధనంయజరెడ్డి, రమ్య, జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖ ర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ నాగజ్యోతి, డీపీఓ లక్ష్మి, చిత్తూరు రూరల్ మండల వైకాపా నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాలారు నదిలో ఈతకు దిగి

# ఇద్దరు దుర్మరణం

### మృతులు తమిళనాడు వాణియంబాడి వాసులు !!



మృతి చెందిన తమిళనాడువాసులు

కుప్పంరూరల్, అక్టోబర్ 9 ప్రభాతవార్త

ఆదివారం సరదాగా ఈత కొడదామనుకుని తమిళ నాడు నుంచి వచ్చిన ఇద్దరు యువకులు పాలారు నదీ ప్రవాహంలో చిక్కుకుని ఈత రాక లోతట్టు ప్రాం తంలో మునిగి దుర్మరణం పాలైన సంఘటన మండలం లోని పెద్దవంక శ్రీ కనకనా శమ్మ ఆలయ సమీపంలో ఉన్న పాలారు నదీ ప్రాం తంలో చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి వివరాలిలా.. తమిళనాడు రాష్ట్రం వాణియంబాడి పట్టణం ఇబ్రహీం నగర్‌కు చెందిన ఇలియాజ్ (45), ఓజర్ (17)లు ఆదివారం మరో ఇద్దరితో కలసి పెద్దవంక పాలారు చెక్‌డ్యామ్ వద్దకు చేరుకున్నారని స్థానికులు తెలిపారు. వీరు అక్కడే పాలారు నదిలో ఈత కొట్టేందుకు దిగారు. అయితే నీటి మట్టం అధికంగా ఉన్న ఉన్న ప్రాంతంలో ఈతరాక ఇలియాజ్, ఓజర్ లోతట్టు ప్రాంతంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న కుప్పం ఫైర్ అధికారి ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలసి సంఘటనా స్థలికి చేరుకున్నారు. నదిలో గల్లంతైన ఇద్దరి ఆచూకీ కోసం గాలించి చివరకు మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు. సంఘటనా స్థలం తమిళనాడు ప్రా ంత పరిధిలో రావడంతో వాణియంబాడి పోలీసులు మృతదేహాలను తరలించి కేసు నమోదు చేశారు.

# దేవుని బ్రహ్మోత్సవాలు అద్భుతం

తిరుమల, అక్టోబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:

రెండేళ్ళ తరువాత భక్తుల మధ్య భగవంతుని బ్రహ్మోత్సవ వాహనసేవలు కలియుగవైకుంఠం తిరుమలలో అద్భుతంగా జరిపించారని అత్యధిక భక్తులు అభినందనలు తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు గ్యాలరీల్లో సకల సదుపాయాలు, మూలవిరాట్టు దర్శనం వంటివి చక్కగా నిర్వహించారని కొనియాడారు. ఆదివారం ఉదయం "డయల్ యువర్ ఇఓ"కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అడిగిన ప్రశ్నలకు ఇఓ ఏవి ధర్మారెడ్డి సమాధానాలిచ్చారు. బ్రహ్మోత్సవాలలో సేవలు అద్భుతమని, గ్యాలరీలలో తాగునీటి సదుపాయం మెరుగుపరచాలని మదనపల్లినుంచి రెడ్డప్ప, ఒంగోలు నుంచి వెంకటేశ్ కోరారు. శ్రీవారి సేవకులు గ్లాసులతో తాగునీటినినిరంతరంగా అందించినా, భక్తులు కూడా ప్లాస్టిక్ రహిత నీటి సీసాలు తెచ్చుకోవాలని ఇఓ ధర్మారెడ్డి సూచించారు. తమిళనాడుకు చెందిన మురుగన్ మాట్లాడుతూ తిరుమలలో పలుప్రాంతాలు, కాటేజీలు, అతిధిగృహాలు సూచిస్తూ ఏర్పాటుచేసిన సూచికబోర్డులు తమిళంలో కూడా ఏర్పాటుచేయాలని కోరారు. ఇందుకు ఇఓ స్పందిస్తూ తప్పకుండా తమిళంలో కూడా ఏర్పాటుచేస్తామన్నారు. బెంగుళూరునుంచి రవికుమార్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులను ఒకచోట నిలబెట్టి వాహనసేవలు వీక్షించేందుకు వదలితే బాగుంటుందని సూచించారు. ఇందుకు ఇఓ సమాధానమిస్తూ గరుడసేవరోజు హారతులు రద్దుచేసి నాలుగుమూలలా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుచేసి 50వేలమందికి దర్శనం కల్పించామన్నారు. తిరుపతి నుంచి శ్రీనివాస్, హైదరాబాద్‌నుంచి నారాయాణాచారి, నంద్యాల నుంచి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భక్తుల రద్దీ అధికంగా ఉన్నందున తిరుపతిలో ఎస్ఎస్‌డి టోకెన్ల కౌంటర్లు ఏర్పాటుచేయాలని కోరారు. దీనిపై ఇఓ రెడ్డి సమాధానంగా తిరుపతిలో త్వరలో టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేస్తామన్నారు. తిరుమలలో అన్ని లడ్డూకౌంటర్లుపనిచేసేలా చూడాలని బెంగుళూరు నుంచి వెంకటేశ్ కోరారు. అన్ని కౌంటర్లు పనిచేసేలా చర్యలు తీసుకుంటామని, లడ్డూ వితరణ శాలలో మొదటి అంతస్థులోనికి వెళితే 20నిమిషాల్లో లడ్డూలు అందుకునేలా చూస్తున్నామన్నారు. సత్యవేడునుంచి అనిల్‌రెడ్డి మాట్లాడుతూ తిరుమలలో హోటళ్ళలో టిఫిన్ ధరలు అధికంగా ఉన్నాయని ఫిర్యాదు చేశారు. దీనిపై ఇఓ ధర్మారెడ్డి స్పందిస్తూ అన్నప్రసాదం భవనంలో ఉదయం నుంచి రుచికరమైన అల్పాహారం, అన్నప్రసాదాలు అందిస్తున్నాము, జనతా క్యాంటీన్లలో మాత్రమే టిటిడి నిర్ణయించిన ధరలు అమలుచేసి ఆహారపదార్థాలు విక్రయిస్తారన్నారు.

-తమిళంలో కూడా సూచికబోర్డులు ఏర్పాటు
-త్వరలో తిరుపతిలో టైమ్‌స్లాట్ టోకెన్లు
:టిటిడి ఇఓ ధర్మారెడ్డి



తిరుమలలో ప్రస్తుతం అమలవుతున్న గదుల కేటాయింపు వ్యవస్థను తిరుపతికి తరలించి చేపట్టనున్నట్లు ఇఓ చెప్పారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహకిశోర్, సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ 2 జగదీశ్వర్‌రెడ్డి, రవాణా జిఎం శేషారెడ్డి, ఆరోగ్యఅధికారిణి డాక్టర్ శ్రీదేవి, కేటరింగ్ అదికారి శాస్త్రి, వసతి కల్పన డిప్యూటీ ఇఓ భాస్కర్, పిఆర్ఓ డాక్టర్ తలారి రవి, విజిఓ బాలిరెడ్డి, ఏపిఆర్ఓ నీలిమారావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు షార్‌లో

# రోహిణి సౌండింగ్ రాకెట్ ప్రయోగం

### - విద్యార్థుల సమక్షంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు



పాండిచ్చేరిలో ముఖ్యమంత్రి రంగస్వామిని సత్కరిస్తున్న షార్ డైరెక్టర్ రాజరాజన్

శ్రీహరికోట (తడ), అక్టోబర్ 9 ప్రభాతవార్త

శ్రీహరికోటలోని సతీష్‌థవన్ అంతరిక్ష కేంద్రంలో సోమవారం రోహిణి సౌండింగ్ రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలలో భాగంగా షార్ కేంద్రానికి వచ్చే విద్యార్థులను ఉత్సాహపరచడానికి ఆర్‌హెచ్ 560 రాకెట్ ప్రయోగిస్తారు. సౌండింగ్ రాకెట్ కాంప్లెక్స్ నుంచి ఈ బుల్లి రాకెట్ అంతరిక్షంలో విహరించనుంది. ఇక్కడికి కేవలం అర కిలోమీటరు దూరం నుంచి ఈ ప్రయోగాన్ని నేరుగా తిలకించనున్నారు. గతంలోనూ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా ఇటువంటి సౌండింగ్ రాకెట్ ప్రయోగాలు నిర్వహించారు. ఇస్రో వాతావరణ అధ్యయనాల కోసం గతంలో సౌండింగ్ రాకెట్లను విరివిగా ప్రయోగించేది. ప్రస్తుతం విద్యార్థుల సందడి రాకెట్ ప్రయోగాన్ని వీక్షిస్తే రెట్టింపు అవుతుందన్న నమ్మకంతో ఈ రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. సోమవారం శ్రీహరికోటలో అంతరిక్ష వారోత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా షార్ డైరెక్టర్ రాజరాజన్‌తో పాటు ఇతర ముఖ్య అధికారులు, సీనియర్ శాస్త్రవేత్తలు, కొన్ని ఇన్‌స్టిట్యూట్ల నుంచి ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిసింది. ఈసారి ఎంతో ప్రతిష్టాత్మకంగా అంతరిక్షం-సుస్థిరత్వం పేరుతో జరిపిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు-2022 విజయవంతం కావడంతో మరింత హుషారుగా షార్‌లో ముగింపు వేడుకలకు సిద్ధమవుతున్నారు. అయితే ఆదివారం సాయంత్రం నుంచి ఉరుములు మెరుపులతో కూడిన భారీవర్షం కురుస్తుండటం వల్ల వాతావరణం ఏమైనా అడ్డంకిగా మారుతుందా అన్నది సందేహంగా ఉంది.





# వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం

### జిల్లా కలెక్టర్ వెంకటరమణరెడ్డి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 9, ప్రభాతవార్త

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి, ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డిలు కొనియాడారు. ఆదివారం కపిల తీర్థం వాల్మీకి రామాలయం మాల్వాడి గుండం వద్ద వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వాల్మీకి జయంతి ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, నగర పాలక సంస్థ మేయర్ డా. శిరిషలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృషి వుంటే మనుషులు ఋషులవుతారని చరిత్రే చెప్తోందని ఈ రోజు మనం వాల్మీకి జయంతిని ఎందుకు మన రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్నామని అంటే మహనీయులు వారి జీవితాన్ని మనం ఆదర్శంగా, స్ఫూర్తిగా తీసుకుని వారి అడుగు జాడల్లో నడిచి తమ జీవిత లక్ష్యాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. అందుకే వారిని మనం స్మరించుకుంటున్నామని తెలిపారు. రెండు పక్షులలో ఒకటి మరణించిన సందర్భంగా శ్లోకం నుండి మొట్టమొదటి శ్లోకం మనకు అందించిన మహర్షి మన వాల్మికి అని అన్నారు. అందరూ వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దైనందిన జీవితంలో స్ఫూర్తితో జీవించాలని పిలుపునిచ్చారు. ఎప్పుడో ఎన్నో వేల సంవత్సరాల క్రితమే జ్ఞానం ఎవరో ఒకరి సొత్తుకాదని కృషి చేస్తే జ్ఞాన సముపార్జన ఎవరికైనా సాధ్యమే అని బోయ వర్గానికి చెందిన మహర్షి వాల్మీకి విషయంలో నిరూపితమైందని అన్నారు. అందరికీ అనుసరణీయం అయిన రామాయనం రచించిన ఆదికవి అని అన్నారు.

తొలుత జిల్లా కలెక్టర్ వాల్మికి మహర్షి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస రావు, జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ, సాధికార అధికారి యుగంధర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య, కార్పొరేటర్ సిద్ధారెడ్డి, వాల్మికి సంఘ నాయకులు భాను ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సంక్షోభంలో శ్రీకాళహస్తి మున్సిపాలిటీ!

### పేరుకుపోయిన పాత బకాయిలు - చెల్లింపుల కోసం కాంట్రాక్టర్ల ప్రదక్షిణలు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి మున్సిపాలిటి స్థాయి పెరిగింది కానీ ఆదాయ వనరులు పెరగలేదు. ప్రభుత్వం నుంచి చిల్లి గవ్వ నిధుల్లే కుండా అభివృద్ధికి ఆమడదూరంలో కొట్టుమిట్టాడుతుంది. అభివృద్ధి పనులకు సంబంధించి ఎన్ని సార్లు టెండర్లు పిలుస్తున్నా కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదు. ఇక జగనన్న కాలనీల్లో పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు కూడా చెల్లింపుల కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సమాధానం చెప్పలేక అధికారులు ముఖం చాటేసే పరిస్థితి చోటు చేసుకుంది. రాష్ట్రంలోని అన్ని ము న్సిపాలిటిలకు ఎన్నికలు జరుగుతున్నాయి. పాలకమండళ్ళు వస్తున్నాయి. అయితే శ్రీకాళహస్తి మునన్సిపాలిటికి కేసుల మీద కేసులు కోర్టుల్లో నడుస్తున్నాయి. హైకోర్టులో పరిష్కరిద్దామంటే సుప్రీం కోర్టులో మరో కేసు నడుస్తుంది. దాంతో ఇప్పటిలో శ్రీకాళహస్తి మున్సిపాలిటికి ఎన్నికలు జరిగే పరిస్థితి లేదు.

#### పాత బిల్లుల చెల్లింపుల ఊసే లేదు:

శ్రీకాళహస్తి పురపాలకసంఘంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఏళ్ళ తరబడి చెల్లింపులు చేయక బకాయిలు తడిసి మోపె డయ్యాయి. ఇప్పటి వరకు మున్సిపాలిటి ఎంత బకాయి ఉన్నది తేలలేదు. ఈ చెల్లింపులకు సంబంధించి బిల్లుల చెల్లింపుకు ప్రభుత్వం వద్ద కునుకు తీస్తున్నట్లు సమాచారం. అయితే రాబోవు మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులకు నిధులు కోరు తుంటే 'సాధారణ నిధుల' నుంచి చేసుకోమని ఉన్నతాధికారుల నుం చి సమాధానం వస్తున్నట్లు సమాచారం. శ్రీకాళహస్తి పుణ్య క్షేత్రం ఆలయానికి దేశ విదేశాల నుంచి అతిథులు వస్తుంటారు. ఇంటి అభివృద్ధి వాకిలి చూస్తే చాలంటారు. అలాగే శ్రీకాళహస్తి అభివృద్ధి దేవాలయ పరిసరాలను బట్టి తెలుస్తుంది. పన్నుల వసూళ్ళకు వెళుతున్న సిబ్బందిపై జనం తిరగబడుతున్నారు. తెలుగుదేశం హయాంలో పనులు చేసిన కన్నలి కాలువ వర్షపు నీరు మళ్ళి కాలువ నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పటి వరకు చెల్లించలేదు. ఇలాగే తెలుగుదేశం హయాంలో పనులు చేసిన కాంట్రాక్టర్లు ప్రస్తుతం టెండర్లు ప్రచురితం అవుతున్నా ఎవ్వరూ వేయటానికి ముందుకు రావటం లేదు.

#### దేవస్థానం ఆదుకోవాలి!

శ్రీకాళహస్తి అభివృద్ధి ఇటు మున్సిపాలిటి అటు దేవస్థానం మీద ఆధారపడి ఉంది. తిరుపతి అభివృద్ధికి ఎలా తిరుమలేశుని నిధులు వెచ్చిస్తున్నారో అలాగే శ్రీకాళహస్తి అభివృద్ధిలో దేవస్థానంను భాగస్వామ్యం చేయాలి. పట్టణాభివృద్ధిలో భాగంగా దేవస్థానం కరెంటు బిల్లులు, నాలుగుమాడావీధులు, రైల్వే స్టేషన్, ఆర్‌టిసి బస్టాండు వరకు పర్యవేక్షణ దేవస్థానం తీసుకోవాలని ఖర్చులు భరించాలనే డిమాండ్ ఉంది. గత ప్రభుత్వ హాయాం నుంచి కోరుతున్నారు. అయితే దేవస్థానం గతంలో చెల్లిస్తున్న కార్‌పార్కింగ్ వాటా కూడా ఇవ్వటం లేదు. ఇక అభివృద్ధికి సంబంధించి నాయకుడు స్థానిక అధికారులపై వత్తిడి తీసుకురావటం కన్నా ప్రభుత్వంతో పోరాడి పుణ్యక్షేత్రానికి నిధులు తీసుకురావాల్సి ఉంది.

#### అభివృద్ధి పథకాలపై దృష్టి: కమిషనర్

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పలు సమస్యలను గుర్తించామన్నారు. వాటికి ప్రతిపాదనలు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వ మంజూరుకు పంపామని కమిషనర్ బి.బాలాజినాయక్ తెలిపారు. సాధారణ నిధులు లేనందువల్ల అధికారులు ముందుజాగ్రత్తగా పనులు చేయించి కాంట్రాక్టర్‌ను తిప్పుకోవటం కన్నా చేయించకపోవటమే మిన్న అని భావిస్తున్నారు. తమ పరిధిలో తాము అభివృద్ధికి సంబంధించి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సాధారణ నిధులనుంచి అత్యవసర పనులను చేపడుతున్నామని కమిషనర్ వివరణ ఇచ్చారు.

# ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

## ఎస్టీలుగా గుర్తించాలని డిమాండ్

కుప్పం, అక్టోబర్ 9 ప్రభాతవార్త

కుప్పం సమీపంలోని వాల్మీకి భవన్ వద్ద ఆదివారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూజలు చేశారు. నియోజకవర్గ వాల్మీకి సంఘ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రాయలసీమలో అత్యధికంగా ఉన్న వాల్మీకులను ఎన్నికలసమయంలో వాడుకుని అధికారంలో వచ్చాక వదిలేయడం దారుణమన్నారు. కుప్పంలో వాల్మీకుల కోసం 2కోట్లతో చేపట్టిన వాల్మీకి భవన్ నిర్మాణం ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. జిల్లా తెదేపా వాల్మీకి సాధికార సమితి అధ్యక్షుడు బేటప్పనాయుడు



మాట్లాడుతూ బిసిలకు చంద్రబాబునాయుడు తప్ప మరెవరూ మేలు చేయలేదన్నారు. అనంతరం కుప్పంలో అన్న క్యాంటీన్ ద్వారా అన్న దానం చేపట్టారు. కార్యక్రమంలో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, నేతలు సాంబశివం, మునిరత్నంనాయుడు, జిమ్‌దాము, సురేష్‌కుమార్, కృష్ణప్ప, శ్రీనివాసులు, వెంకటస్వామి, మురళి, డా॥వెం కటేష్, సత్యేంద్ర శేఖర్, త్రిలోక్, శాంతారాం, సం తోష్, యువత అధ్యక్షుడు మణి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక ప్యాలస్‌రోడ్‌లో వాల్మీకి జయంతిని జమీందారీవంశస్తులు బాలాజీ, కౌన్సిలర్లు జిమ్‌దాము, సురేష్‌కుమార్, వాల్మీకిసంఘనేత సురేష్‌ల అధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర నేత ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

**రామకుప్పం :** మండలంలో వాల్మీకి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా పలుచోట్ల వాల్మీకి మహర్షి చిత్రపటాలను ఊరేగించారు. అంతకుముందు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూజలు చేశారు.

## మాజీమంత్రి రఘువీరారెడ్డిచే బిఆర్‌డి ఆస్పత్రి ప్రారంభం



కుప్పం, అక్టోబర్ 9 ప్రభాతవార్త

రాష్ట్ర మాజీ మంత్రి నీలకంఠాపురం రఘువీరారెడ్డి, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ డా॥ తులసిరెడ్డిలు ఆదివారం కుప్పంలో బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించారు. దివంగత మాజీ ఎమ్మెల్యే బిఆర్ దొరస్వామి నాయుడు తనయుడు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డా॥ బిఆర్ సురేష్‌బాబు, డా॥ హరిత దంపతులు బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో తెచ్చేందుకు నూతనంగా నిర్మించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు 24గంటల పాటు అన్ని వైద్య సేవలు అందుబాటులో తెచ్చామన్నారు. తక్కువ ఖర్చుతోనే ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందిస్తామన్నారు. ఆస్పత్రి ప్రారంభోత్సవానికి పలువురు ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యారు.

## సిద్ధవైద్యం ప్రాచీన భారత సంస్కృతి

– మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్



కుప్పం, అక్టోబర్ 9 ప్రభాతవార్త

సిద్ధవైద్యం ప్రకృతి సిద్ధమైన భారత ప్రాచీన సంస్కృతిలో భాగమని కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. ఆదివారం సాయిమాతా సేవా ట్రస్ట్, తిరుపతి సిద్ధ క్లినికల్ రీసెర్చ్ సెంటర్ అధ్వర్యంలో ఉచిత సిద్ధ వైద్య శిబిరాన్ని ఛైర్మన్ ప్రారంభించి ప్రసంగించారు. సిద్ధ మందులు అనారోగ్యాన్ని పార ద్రోలి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయన్నారు. అనంతరం 250మందికి ఉచితంగా వైద్య సేవలు అందించి మాత్రలు పంపిణీ చేశారు. సిద్ధ వైద్యులను మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైద్య బృందం డా॥ శ్యామ్ రాజ్, డా॥ రాజ్యలక్ష్మి, అనిల్, సాయిమాతా సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు పాల్గొన్నారు.

## వాల్మీకి యుగయుగాలకూ ఆదర్శనీయుడు

–విశ్రాంత డిఎస్పీ సుకుమార్‌బాబు



పుంగనూరురూరల్, అక్టోబరు 9 ప్రభాతవార్త :

రామాయణమహాకావ్యాన్ని రచించి మానవ మనగడలో దేవుడు కూడా మనిషివలే నడయాడిన దేవదేవుని చరితనులోకానికివిశదపరచినశ్రీవాల్మీకి మహర్షి యుగయుగాలకూ ఆదర్శనీయుడని విశ్రాంత డిఎస్పీ, వాల్మీకి సంఘ అధ్యక్షుడు కనుమకుంట సుకుమార్‌బాబు అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా పట్టణంలోని ముడెప్ప సర్కిల్ వద్ద వాల్మీకి విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకులను దేశవ్యాప్తంగా ఎస్టీల జాబితాలోనికి చేర్చాలని చేస్తున్న డిమాండ్‌లో భాగంగా రాష్ట్రంలో ఉద్యమాన్ని ప్రారంభించబోతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్రజానపద కళల అకాడమీ ఛైర్మన్ కొండవీటి,పిఎంకె ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డియాదవ్,డాక్టర్ శివ,ఎంపిపి అక్కిసాని భాస్కరరెడ్డి,మున్సిపల్ వైస్ నాగేంద్ర,లలితమ్మ,చంద్రారెడ్డి యాదవ్,నటరాజ,బోయవాల్మీకి సంఘ నాయకులు అద్దాల నాగరాజుతో పాటూ పలువురు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకిమహర్షి జయంతి వేడుకలు

పెద్దపంజాణి, అక్టోబర్ 9,ప్రభాతవార్త :



మండలంలో వాల్మీకిమహర్షి జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం పెద్దపంజాణి వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాల్మీకిమహర్షి చిత్రపటానికి పూజలు నిర్వహించి కర్ణాటక రాష్ట్రం నుండి ప్రత్యేకంగా తెప్పించిన అశ్వదల వాహనంపై వాల్మీకిమహర్షి చిత్రపటాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించి మేళతాళములతో, చెక్కభజనలతో, కోలాటములతో, బళ్ళారిడ్రమ్స్ తో, బాణాసంచావేడుకలతో అతి వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విఆర్‌పియస్ కార్యదర్శి ఎల్.భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అద్దాల నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు గంగప్ప, మండల కన్వీనర్ బాగారెడ్డి, పెద్దారికుంట సర్పంచ్ భాస్కర్, డాక్టర్ సుబ్రమణ్యం, ఎంపిటీసీ గురుమూర్తి, గడ్డంవారిపల్లి చలపతి, పొట్టగానిపల్లి నగేష్, బొమ్మల కుంట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ అలసత్వం విడనాడాలి

పలమనేరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



రాష్ట్రంలో ఉన్న 3లక్షల మంది పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ అలసత్వాన్ని వీడనాడాలని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శి గురురాజారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక నార్త్ పాఠశాలలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై 2018, జనవరి 2019 సంబందించిన డిఆర్ బకాయిలు పెన్షనర్ల ఖాతాలో చూపించి చెల్లించకుండా అసోమ్ముపై ఆదాయపు పన్నుమినహాయించడం దారుణమన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమం చేపట్టలేదన్నారు. జూలై 2019 నుండి నూతన వేతన స్కేల్ ప్రకారం డిఆర్ చెల్లించాలని తెలిపారు. ఏప్రిల్ 2020నుండిడిసెంబర్2021మధ్యకాలంలోచెల్లించవలసిన పిఆర్‌సి బకాయిలపై తగిన నిర్ణయం ప్రభుత్వం వెంటనే తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన డిఆర్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు వర్తింపు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

## విలువలతో కూడిన జీవనం సాగించాలి

పలమనేరు, అక్టోబర్ 9, ప్రభాతవార్త:



సమాజంలో ప్రతి ఒక్కరూ విలువలతో కూడిన జీవనం సాగించాలని ఏ.ఎస్.పౌండేషన్ అధ్యక్షులు అవిలాల శ్రీధర్ కోరారు. ఆదివారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళామందిరంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగా సంప్రదాయ కళల పరిరక్షణ సంస్థ, ఏ.ఎస్.ఫౌండేషన్ సంయుక్తంగా వాల్మీకి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని కోలాటం, జడకోలాటం, చెక్కభజన, సంగీతకచేరి, బుర్రకథ మొదలైన ప్రాచీన కళలను నిర్వహించారు. తెలుగు సాహిత్య సంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు తులసినాథంనాయుడు, పుష్ప, సాంప్రదాయ కళల పరిరక్షణ సంస్థ అధ్యక్షులు మడవలి చిరంజీవి భాగవతార్ తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంటు విజేత కొళత్తూరు జట్టు.

పెద్దపంజాణి అక్టోబర్ 9 ప్రభాతవార్త :



బసవరాజుకండ్రిగలో వారం రోజులు జరిగిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నిమెంట్‌లో కొళత్తూరు జట్టు 30వేల రూపాయలు మెదటి బహుమతి, బసబరాజుకండ్రిగ జట్టు 20వేల రూపాయలు ద్వితీయ బహుమతి, పంజాణి జట్టు 10వేల రూపా యలు తృతీయ బహుమతి గెలుపొందింది. వీరికి జిల్లా తెలుగుదేశం పార్టీయువత అధికార ప్రతినిధి రోజాక్రిష్టా రెడ్డి, కోగిలేరు సర్పంచు రమేష్‌బాబు, మాజీ ఎంపీపీ మురళీకృష్ణ బహుమతులు, నగదు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు వేణుగోపాల్, సుబ్రమణ్యం(సుబ్బు), నాగరాజు, హేమంత్ కుమార్, విశ్వనాథ్ రెడ్డి, మంజునాథ్, మునిరాజు, బసవరాజు, లోకేష్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మిలాదున్నబీ వేడుకలు

పుంగనూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త :




పట్టణంలో సున్నీఅంజుమన్ కమిటీ అధ్వర్యంలో ఆదివారం మిలాదున్నబీ పర్వదినాన్ని ముస్లిం మైనార్టీలు వేడుకగా నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా పట్టణంలో మైనార్టీలు ర్యాలీలు నిర్వహించినఅనంతరం రాతిమసీదు, కుమ్మరవీధి మదీనామసీదు, రహమత్‌నగర్ మసీదుల వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగాసన్నీఅంజుమన్‌కమిటీనాయకులు మాట్లాడుతూ ధర్మనిరతిలో జీవనం సాగించేందుకు ఇస్లాం ప్రాధాన్యతిస్తోందని, ఇందులో భాగంగా సమాజంలోని పేదలకు తోడ్పడడం ఎంతో ముఖ్యమని బోధిస్తోందన్నారు. ఆయా మసీదుల ముతవలీలు, ముస్లిం యువజన సంఘాలు, ప్రజలు పాల్గొన్నారు.

# పరమాత్మే ముగ్గురుగన్న అమ్మ మూలపు పెద్దమ్మ



తవణంపల్లె, అక్టోబర్ 9 ప్రభాతవార్త:

పరమాత్మే ముగ్గురుగన్న అమ్మ మూలపు పెద్దమ్మ త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక బంగారుపాళ్యం–2 కమిటీ అధ్యక్షులు ధనంజయ అన్నారు. దసరా పండుగ సందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక బంగారుపాళ్యం–2 సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆధ్వర్యంలో మండలంలో జరుగుతున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎగువ వెంకటాపురం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంధములపై పరిచయ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని సృష్టించిన పరమాత్మకు మూడు గుణములు వున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీతను తప్పకుండా చదవాలని సూచించారు. కమిటీ అధ్యక్షులు ధనుంజయ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో సభ్యులు దేవరాజులు, భానుమతి, ఉమాశంకర్, విమలమ్మ, నాగమ్మ, చిట్టెమ్మ, మంజుల, లలిత, చాముండీ, కిట్టు, లత, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

సూళ్లూరుపేట, కోట, వెంకటగిరి, బాలాయపల్లి దొరవారిసత్రం,

## విద్యుత్ షాక్ గుర్రై వ్యక్తి మృతి

చిల్లకూరు అక్టోబర్ 9 ప్రభాతవార్త



మండలంలోని ఏరూరు గ్రామ పంచాయితీలోని ఉలసావాని దిబ్బ గ్రామానికి చెందిన సర్వేపల్లి సుధాకర్ (60) విద్యుత్‌షాకు గుర్రై మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు శనివారం రాత్రి రొయ్యల గుంటల వద్ద కరెంటుకి అంతరాయం కలగడంతో జనరేటర్‌తో విద్యుత్‌ను సరఫరా చేసేందుకు వెళ్లగా వెంటనే రిటన్ విద్యుత్ రావడంతో విద్యుత్ షాకుకు గుర్రై మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడుకు కొడుకు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్ఐ బి గోపాల్ సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

## ఎంఎల్‌సి ఎన్నికలపై అధ్యాపకులతో ఆత్మీయ సమావేశం

కోట, అక్టోబర్ 9 ప్రభాతవార్త



రాయలసీమ పరిధిలోని ప్రైవేటు కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యంతో, అధ్యాపకులతో అన్నమాచార్య గ్రూపు ఆఫ్ ఇన్‌ట్యూషన్స్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో కమ్యూనిటి బోర్డ్ ఆఫ్ చైర్మెన్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ఆత్మీయ సమావేశంలో పట్టభద్రుల, అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ శ్యామ్ ప్రసాద్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిలను అత్యధిక మెజార్టితో గెలిపించాలని కోరారు. అనంతరం శ్యామ్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ మీ అందరు కూడా మీ కుటుంబసభ్యుడిగా భావించి తన గెలుపునకు సహకరించాలని కోరారు. మీ అందరి సహకారంతో తను మండలిలోకి అడుగుపెడితే ప్రైవేటు, డిగ్రీ, ఇంజిరీరింగ్‌కళాశాలలసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని చెప్పారు.

## సర్పంచుల అరెస్ట్ అమానుషం

కోట, అక్టోబర్ 9 ప్రభాతవార్త



గ్రామాల అభివృద్ధిని ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించిన సర్పంచులను అరెస్ట్ చేయడం అమానుషమని కోట మండల వెంకన్నపాళెం గ్రామ పంచాయతీ సర్పంచ్, కోకర్ల మదుసూధన్‌యాదవ్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం కోటలో విలేకర్లుతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు సర్పంచులు పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తే వారి గొంతనొక్కేశారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం ఇప్పటి వరకూ రాష్ట్రంలో దారిమల్లించిన రూ 8.700 కోట్ల పంచాయతీ నిధులను తక్షణం వెనక్కు సర్దుబాటు చేయాలన్నారు. సర్పంచుల ప్రభుత్వం ఉత్సవ విగ్రహాలుగా మార్చిందన్నారు. పాలకుల తీరుపై అధికార పార్టీకి చెందిన సర్పంచులే తీవ్ర అగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. సర్పంచుల డిమాండ్లను తక్షణం పరిష్కరించాలనిలేని పక్షంలో పార్టీలకు అతీతంగా వారిని కలుపుకుని ఆందోళన చేస్తామని తెలిపారు.

## శివ భక్తులచే అన్నదానం

సూళ్లూరుపేట, అక్టోబర్ 9 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని హనుమాన్ వీధిలో గల అభయ కల్యాణ మహేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో పాటు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు చేసుకొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ రమేష్‌లాల్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా పట్టణ అభివృద్ధి – ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట, అక్టోబర్ 9 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణాన్ని అభివృద్ధిపరంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని పాండురంగ గుడి వద్ద నుంచి గాంధీబొమ్మ వరకు నిర్మించనున్న రెండువైపులా డ్రైనేజి, సిమెంటురోడ్డు నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేశారు. పట్టణంలో అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రప్రథమంగా ఎన్నో ఏళ్లుగా ప్రధాన రోడ్డు అయిన బాపూజీవీధి రోడ్డును ప్రస్తుతం రూ.85 లక్షలతో నూతన రోడ్డుగా నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. గత మున్సిపాలిటీ హయాంలో చేయలేని ఎన్నో అభివృద్ధి పనులను ప్రస్తుతం చేపడుతున్నామన్నారు. వట్రపాలెం, బాపూజీకాలనీ, సూళ్లూరు, రాఘవయ్యపేట, హాస్పిటల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఇప్పటికే రోడ్లు, డ్రైనేజి నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. స్థానిక మున్సిపల్ పాలక వర్గం ప్రత్యేక శ్రద్ధలతో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం బజారు సెంటర్లో చేపడుతున్న సిమెంటు రోడ్డు పనులకు ఆ ప్రాంత ప్రజలందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఒక వేళ అభివృద్ధి పనుల్లో భాగంగా కొద్దిగా సొంత స్థలాలను ఇచ్చేందుకు కూడా స్వచ్ఛంధంగా ముందుకు రావాలని ఎమ్మెల్యే కోరారు. ఈ ప్రాంతంలో రోడ్డు పనులు చేపట్టేందుకు సంబంధిత వ్యాపారులతో, నివాసం ఉంటున్న వారితో చర్చించి మార్గాన్ని సుగమం చేసిన పట్టణ ప్రముఖులు కాళంగి ప్రభాకర్‌ను ఆయన అభినందించారు.



**వికేంద్రీకరణతో రాష్ట్ర అభివృద్ధి**

రాష్ట్రానికి మూడు రాజధానులు వికేంద్రీకరిస్తే అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయనబినామీలు రియల్ ఎస్టేట్ వ్యాపారంకోసంఅభివృద్ధిమొత్తంఅమరావతిలోచేయాలని సంకల్పించడం మంచిది కాదన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ చిన్ని సత్యనారాయణ, కౌన్సిలర్లు పముజుల విజయలక్ష్మి, ముంగర శేషారెడ్డి, మీజూరు రామకృష్ణారెడ్డి, కొండూరు జనార్ధన్, మునిప్రసాద్, లక్ష్మీదేవి, సౌజ న్య, పట్టణ ప్రముఖులు కాళంగి ప్రభాకర్, వైసీపీ నాయకులు జెట్టి వేణుయాదవ్, స్వామిరెడ్డి, అయితా శ్రీధర్, కాకి శ్రీరామమూర్తి, సుబ్ర హ్మణ్యంరెడ్డి, కొండూరు వెంకటేశ్వర్లు, మాదరపాక బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## తడ, వాటంబేడుకుప్పంలలో బొమ్మన్ వర్ధంతి

తడ, అక్టోబర్ 9 ప్రభాతవార్త



దివంగత పులికాట్ జాలర్ల సంఘం నేత, తడ మండలాధ్యక్షునిగా పనిచేసిన బొమ్మన్ సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాలర్ల సంఘం, తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో తడ, ఆయన స్వగ్రామం వాటంబేడు కుప్పంలలో ఈ కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. వాటంబేడులో బొమ్మన్ సుందరయ్య విగ్రహానికి ఆయన కుటుంబ సభ్యులు, మాజీ జడ్పీటీసీ బొమ్మన్ శ్రీధర్, మాజీ సర్పంచ్ ఏకాంబరం, జాలర్ల సంఘం నాయకులు ఫళనిల ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. అనంతరం తడలో జరిగిన కార్యక్రమంలో తిరుపతి జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, పార్టీ నాయకులు బొమ్మన్ శ్రీధర్, కె.సెల్వం, సుధాకర్, కెవి.రెడ్డి, రాజారెడ్డి, రవి, సుందరం తదితరులు పాల్గొన్నారు.

## మానసాదేవి ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తా

– వెంకటరమణారెడ్డి



నాయుడుపేట, అక్టోబరు 9 ప్రభాతవార్త:

మానసాదేవి ఆలయ అభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని వైసీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకట రమణారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మానసాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి భక్తులకు అన్నదానం చేసి భోజనాలు స్వయంగా వడ్డించి దైవ చింతనతో మొక్కు తీర్చుకున్నారు. తొలుత ఆలయ మర్యాదలతో కట్టా వెంకటరమణారెడ్డికి ఆలయ కమిటీ నిర్వాహకులు స్వాగతం పలికి శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని భక్తులతో కలసి ఆలయంలో సహపంక్తి భోజనం చేశారు. ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సహకారం అందిస్తానని తెలిపిన కట్టా వెంకటరమణారెడ్డికి ఆలయ కమిటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలి

చౌడేపల్లి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి మండలాధ్యక్షుడు వెంకటేష్ కోరారు. వాల్మీకి మహర్షి జయంతిని పురష్కరించుకొని స్థానిక బస్‌స్టాండులో ఆయన చిత్రపటాన్ని వుంచి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వం మాట ఇచ్చిన విధంగా తమను వాల్మీకులుగా గుర్తిస్తేనే సామాజికంగా, ఆర్థికంగా ఎదుగుతామన్నారు. సంఘ నాయకులు గంగరాజు, ఆదినారాయణ, గుర్రప్ప, వెంకట్రమణ, సతీష్, చైతి తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా అరాచకపాలనకు అంతిమ ఘడియలు

– మాజీ ఎమ్మెల్సీ గౌనివారి



రామకుప్పం, అక్టోబర్ 9 ప్రభాతవార్త

రాష్ట్రంలో వైకాపా అరాచక పాలనకు అంతిమ ఘడియలు సమీపించాయని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇటీవల బెయిల్‌పై జైలునుంచి విడుదలైన గౌనివారితో పాటు పలువురు తెదేపా నేతలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హాజరై సంతకాలు నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమపై కక్షతో కేసులు బనాయించి వేధిస్తున్నారన్నారు. వైకాపాకు ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఘోర పరాజయం తప్పదన్నారు. కార్యక్రమంలో నేతలు మునసా స్వామి, రాజ్‌కుమార్, సుబ్బు, మణి, ఆంజనేయరెడ్డి, ఆనందరెడ్డి, జనార్ధనరెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జనసేనచే నాసేనకోసం..నావంతు కార్యక్రమం

కుప్పంరూరల్, అక్టోబర్ 9 ప్రభాతవార్త



జనసేన పార్టీ గుడుపల్లె మండల అధ్యక్షుడు అమీర్ అధ్వర్యంలో ఆదివారం నా సేన కోసం..నా వంతు కార్యక్రమంను ఆదివారం కుప్పం, గుడుపల్లెలో నిర్వహించారు. ఈ సందర్భంగాప్రజలనుంచిస్వచ్ఛందంగా విరాళాలుసేకరించారు. కార్యక్రమంలో రామూర్తి, గణేష్, జాన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## అధికార పార్టీకి తలొగ్గిన పోలీసులకు శిక్ష తప్పదు

– టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునెప్ప



కుప్పంరూరల్, అక్టోబర్ 9 ప్రభాతవార్త

అధికార పార్టీకి తలొగ్గిన పోలీసులకు తెదేపా అధికారంలో వస్తే శిక్ష తప్పదని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుమునెప్పప్రకటనలోపేర్కొన్నారు. వైకాపా నేతలు పెట్టిన ఓ అక్రమ కేసుకు సంబంధించి ఆదివారం తాను రామకుప్పం పోలీస్ స్టేషన్ లో హైకోర్టు ఆదేశాల మేరకు సంతకం చేయాల్సి ఉండగా తన మేనల్లుడు మృతి చెందాడని దహన క్రియలు అయ్యేదాకా అనుమతి కోరితే పోలీసులు మానవత్వం లేకుండా అనుమతి నిరాకరించార న్నారు. పోలీసులు వైకాపా కార్యకర్తలుగా పనిచేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వంకు అధికారం శాశ్వతం కాదన్నారు.

# బిసిలు తెలుగుదేశంపార్టీకి వెన్నెముకగా నిలవాలి

-డాక్టర్ యం.ఉమేష్‌రావు

తొట్టంబేడు, అక్టోబర్ 9 ప్రభాతవార్త



తెలుగుదేశంపార్టీ స్థాపన ద్వారా స్వర్గీయ నందమూరి తారకరామారావు నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి, చంద్రబాబునాయుడు నాయకత్వంలో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావడానికి మరియు తెలుగుదేశంపార్టీకి బిసిలు వెన్నుదన్నుగా నిలవడానికి బిసి సాధికార సమితి సభ్యులు తీవ్రంగా కృషి చేయాలని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు పిలుపునిచ్చారు. తెలుగుదేశంపార్టీ రాష్ట్ర సాధికార సమితి సభ్యులుగా నియమితులైన మిన్నల్‌రవి మరియు కన్నావరం హరిబాబులను తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి ఉమేష్‌రావు ఆధ్వర్యంలో బిసి నాయకులు తొట్టంబేడులో ఘనంగా సత్కరించారు. అనంతరం వీరు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలను సామాజికంగా రాజకీయంగా మరియు ఆర్థికంగా అభివృద్ధిలోకి తీసుకురావాలనే లక్ష్యంతో నాడు స్వర్గీయ నందమూరితారకరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని కొనియాడారు. తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జి.దశరథాచారి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు నిర్దేశకత్వంలో నియోజక వర్గఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి నాయకత్వంలో తెలుగుదేశంపార్టీని బలోపేతం చేసి రాబోవు 2024 ఎన్నికల్లో ఇటు సుధీర్‌రెడ్డిని ఎంఎల్‌ఏగా, అటు చంద్రబాబునాయుడును ముఖ్య మంత్రిగా గెలిపించుకోవడానికి బడుగు బలహీన వర్గాలు ఐక్యంగా ముందుకు వెళ్ళేలా బిసి సాధికార సమితి సభ్యులు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా తెలుగుదేశంపార్టీ బిసి సాధికార సమితి సభ్యులు మిన్నల్‌రవి మరియు కన్నావరం హరిబాబులు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు మరియు సుధీర్‌రెడ్డి తమకు అప్పగించిన బాద్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ప్రతి నియోజకవర్గంలో గెలిచేలా కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బిసి విభాగం నాయకులు బీమాల భాస్కర్, చింతగింజలసునీల్, చిల్లకూరు బాలసుబ్రమణ్యం(మణి), రామయ్య, వెంకటేష్, భువన, దాము, చెంచయ్య, భార్గవ్, రాజేంద్ర, చలపతి, రమేష్, రవితేజ, భార్గవ్, బాలాజీ, సాయి, వేణు తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా సుదర్శన హోమం, గ్రామోత్సవం

చంద్రగిరి, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



తిరుమల శ్రీవారి పాదాల చెంత స్వామి వారి ఆశీస్సులతో పెరటాశి మాసం మూడవ శనివారం రోజున భక్తిశ్రద్ధల నడుమ స్వామి వారికి మ్రొక్కులు తీర్చుకున్నట్లు చంద్రగిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు బోడ్డెడ్డిగారి అచ్యుత విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గంగుడుపల్లిలో శనివారం ఉదయం నుండి రాత్రి వరకు అచ్యుత విజయ్‌కుమార్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో గ్రామస్థులు సుదర్శన హోమం, గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో కామసాని అప్పిరెడ్డి ఆధ్వర్యంలో కామసాని వారి కులదైవం దేవర ఎద్దు పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలించింది. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ తిరుమల వేదపాఠశాలకు చెందిన పండితుల ఆధ్వర్యంలో కలియుగ వైకుంఠవాసుడు శ్రీ వెంకటేశ్వరస్వామి వారి చిత్రపటానికి విశేష పూజలు నిర్వహించి, సుదర్శన హోమం, గ్రామోత్సవం వైభవంగా నిర్వహించుకున్నట్లు తెలిపారు. స్వామి వారికి ఉపవాసదీక్షలతో "ఏడు కొండలవాడా వెంకటరమణ గోవింద గోవింద గో...విందా అంటూ గొంతెత్తి స్వామి వారిని పూజించడం పెరటాశి మాసం విశిష్టతను తెలియజేస్తుందన్నారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరూ నుదిటున తిరు నామం ధరించి పండుగ వాతావరణంలో ఉత్సాహపూరితమైన మనస్సుతో స్వామి వారికి బియ్యపు పిండి, బెల్లం కలిపి దీపం తయారుచేసి, వివిధ రకాల కాయగూరలతో రుచికరమైన వంటలు చేసి స్వామి వారికి నైవేద్యం (తలిగి) సమర్పించడం జరిగిందన్నారు. సుదర్శన హోమం, గ్రామోత్సవం సందర్భంగా గ్రామంలో టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు వారిచే హరికథ, పాట కచ్చేరి నిర్వహించడం జరిగిందన్నారు. ఆర్‌సి పురం మండలానికి చెందిన ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి జయంతి

తిరుపతి,అక్టోబర్ 9 ప్రభాతవార్త:



శ్రీరామచంద్రుడు జన్మించకముందే ,వాల్మీకి మహర్షి రామయణాన్ని రచించి నేటికీ ఒకేమాట, ఒకే భార్య, ఒకటే మాటగా ప్రతి ఒక్కరూ ఆచరించే విధంగా వాల్మీకి మహర్షి రచనల పుణ్యమేనని బిజెపి నేత, రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వాల్మీకి జయంతి సందర్భంగా స్విమ్స్ ఆస్పత్రి కూడలిలోని వాల్మీకి మహర్షి విగ్రహానికి బిజెపి నేతలు అక్కిపల్లి మునికృష్ణయ్యయాదవ్, కట్టమంచి చంద్రబాబు, సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రవి, సురేష్ తదితరులతో కలసి గోపీనాథరెడ్డి పూలమాలలు వేసి పూజలు చేశారు. వాల్మీకి గొప్పదనం, జీవితచరిత్ర అమోఘమన్నారు.

## క్యాన్సర్ అవగాహనపై ముగిసిన సదస్సు



తిరుపతిలో టిటిడి మహిళ ఉద్యోగులకు శ్వేత ఆధ్వర్యంలో మహతిలో జరిగిన సదస్సు ఆదివారం ముగిసింది. పలువురు వైద్యులు పాల్గొని క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలు గురించి వివరించారు. ముగింపులో పలువురు వైద్యులను సన్మానించారు.

ప్రభాతవార్త-తిరుపతి

## వాల్మీకి జయంతి సందర్భంగా ఒక్క రోజు అంతర్జాతీయ సదస్సు

తిరుపతి (విద్య), అక్టోబర్ 9, ప్రభాతవార్త

శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాల, తెలుగుసమాజం, సింగపూర్, మలేషియా తెలుగు సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి సందర్భంగా ఒక్క రోజు అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి విచ్చేసి మాట్లాడుతూ వాల్మీకి రాసిన రామాయణాన్ని పఠిస్తే లక్ష్యాలు చేరటం సులభతరమవుతుందన్నారు. హనుమంతుని తలిస్తే కార్యసిద్ధి లభిస్తుందన్నారు. పవిత్రమైన ఈ రోజును పండుగలా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ మహదేవమ్మ మాట్లాడుతూ సీతమ్మ హనుమంతునితో పలికిన శ్లోకం కార్యసిద్ధి శ్లోకంగా సుందరాకాండలో పేర్కొంటారన్నారు. ఈ శ్లోకాన్ని మంత్రంలా పఠిస్తే మనం అనుకున్న కార్యాలు నెరవేరుతాయన్నారు. అనంతరం సింగపూర్ తెలుగు సమాజం అధ్యక్షులు కోటిరెడ్డి, ఇండోనేషియా ఉపన్యాసకులు హరినాథ్ రెడ్డిలు మాట్లాడుతూ త్రేతాయుగం నాటి రాముని కథ నేటికి మనకు ఆదర్శమన్నారు. ధృతి, దృష్టి ఈ హనుమాన్‌మంత్రం వల్ల లభిస్తుందన్నారు. ఈ దీక్ష కార్యసిద్ధి కోసం, మంచి పనుల విజయం కోసం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డా. కృష్ణవేణి, సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షులు జ్యోతీశ్వర రెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇస్కాన్‌లో నూతన వంట శాల ప్రారంభోత్సవం

తిరుపతి(క్రీడ), అక్టోబర్ 9, ప్రభాతవార్త



ఇస్కాన్ మందిర ప్రాంగాణంలో అధునాతన నూతన వంటశాల ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. అమృత హార్ట్ కేర్ సెంటర్ అధినేత ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్ఆర్ గుప్త, మందిర ప్రాంగనంలో అదునాతన వంటశాల నిర్మించి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ తిరుపతి మందిర అధ్యక్షులు రేవతి రామదాస్, ప్రభు, మందిర ఉపాధ్యక్షులు రూపేష్, చైతన్య దాస్, ప్రభు, కార్యదర్శి బలభద్ర ప్రభు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మూలకోనలో సీసీ కెమెరాల ఏర్పాటు

పుత్తూరురూరల్, అక్టోబరు 9 ప్రభాతవార్త:



పుత్తూరు మండలం నేసనూరు పంచాయతీ పరిధిలోని మూలకోనలో పుత్తూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు ఆదివారం ఎస్ఐ గౌరిశంకర్, సర్పంచ్ గోవిందస్వామిరెడ్డి ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మూలకోనకు వెళ్లే రహదారిలోని మూడు ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు రోజు పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు. మూలకోనకు అధికంగా తమిళనాడు నుంచి భక్తులతోపాటు యువత విలాసాల కోసం వస్తుండడం తరచూ ఘర్షణలు పడడం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతుండడంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, నాయకులు మునిరాజ, తిరుమలరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గీతామందిరంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం

పుత్తూరురూరల్, అక్టోబరు 9 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో వెలసిన శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గీతామందిరంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని శ్రీ కృష్ణ భగవానుడికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు చేశారు. అలాగే ఆలయంలో ఏర్పాటు చేసిన సత్యనారాయణస్వామి చిత్రపటానికి సాయంత్రం విశేష పూజలు చేశారు. ప్రతి నెలలో పౌర్ణమి రోజు ఈ సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్నట్లు గీతామందిరం వారు తెలిపారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.

## 41 రోజుల మండల ధ్యాన తరగతులు

పుత్తూరురూరల్, అక్టోబరు 9 ప్రభాతవార్త:



త్రినేత్ర పిరమిడ్ ధ్యాన మందిరంలో జరుగుతున్న మండల ధ్యాన శిక్షణ తరగతుల్లో ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుచానూరు పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్టు ప్రెసిడెంట్ ప్రసన్న, రవిలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మనం సంతోషంగా ఉండాలంటే ఏమి చేయాలి ఆధునిక మానవుడు నిజంగా తాను సాధించిన వస్తు సంపదతో సౌకర్యాలతో సదా ఆనందంగా ఉండవచ్చున్నారు. కానీ మనసు స్వభావం విచిత్రం ఏది ఇచ్చినా ఎంత ఇచ్చినా సంతృప్తి చెందరు. మనసు స్వభావాన్ని తెలుసుకోలేక పోవడమే దీనికి కారణం. సంతోషంగా ఉండాలంటే మనం గత తరాల వారితో పోల్చుకోవాలని, పక్కవారితో కాని, ఇదంతా కూడా ఒక్క సాధన మార్గం ద్వారానే తెలుసుకోవచ్చునని వివరించారు. కార్యక్రమంలో సభ్యులు డి.నాగరాజు, సుబ్రహ్మణ్యం, పురుషోత్తంశెట్టి, పల్లయ్య జయచంద్రరెడ్డి, గంగయ్యానాయుడు పాల్గొన్నారు.

## మాజీ జర్నలిస్టు కుటుంబానికి సాయం

శ్రీకాళహస్తి రూరల్, అక్టోబర్ 9 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం మునగల పాళెంకి చెందిన వెంకటరత్నం గతంలో జర్నలిస్టుగా పనిచేశారు. ఆయన ఆదివారం మృతి చెందారు. ఈ విషయా న్ని మండల వైకాపా ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి శాస నసభ్యుడు మధుసూధనరెడ్డి దృష్టికి తెచ్చా రు. ఆయన స్పందించి ఆయన తనయుడు బియ్యపు ఆకర్షరెడ్డి ద్వారా వారికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. వారితో పాటు మునగలపాళెంసర్పంచ్‌మరియుశంకర్ నాయుడు, సునీల్‌రెడ్డి, గంజి రవి యాదవ్, మడిబాక సర్పంచ్ చెంగల్‌రాజు, మధసూధన రాజు,గుండ్రాజు పరమా నంద్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వం స్కూల్ పూర్వ విద్యార్థిని నవశక్తికి గవర్నర్‌చే అవార్డు

తిరుపతి(క్రీడ), అక్టోబర్ 9, ప్రభాతవార్త




తిరుపతికి చెందిన ర్యాలీ నవశక్తికి డబ్ల్యూకెఎంఎ ఎక్స్ లెన్స్ అవార్డు 2022 ను తెలంగాణ గవర్నర్ డా. తమిళసై సౌందర్యరాజన్ ఆదివారం తాజ్ వెల్లింగ్టన్ చెన్నైలో ప్రధానం చేసారు. కరాటే విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో బంగారు పతకాలను సాధించి నందుకు ఈ అవార్డుకు ఎంపికైనట్లు ప్రెసిడెంట్ ఆఫ్ వరల్డ్ కరాటే మాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. బాల మురగన్ తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు సాధించిన తమ పూర్వ విద్యార్థిని నవశక్తిని విశ్వం విద్యా సంస్థల అధినేత డా. ఎన్. విశ్వనాథ్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ విశ్వ చందన్ రెడ్డి, కరస్పాండెంట్ తులసి, విశ్వనాథ్‌లు అభినందించి, అంతర్జాతీయ స్థాయిలో మరిని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు.

# శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న 30వేల మంది భక్తులు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 9 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం పౌర్ణమి సందర్భంగా కిట కిట లాడింది. సాధారణంగా అమావాస్య,పౌర్ణమి సందర్భంగా భక్తులు భారీఎత్తున హాజరై పూజలు జరిపించుకోవటం ఆనవాయితి.ఆదివారం సుమారు 30వేల మంది దర్శనం చేసుకున్నట్లు సమాచారం. ఓ వైపు వర్షం కురుస్తున్నా భక్తులు పట్టించుకోకుండా హాజరయ్యారు. రాహుకేతు దోష నివారణ పూజలు ఐదువేలు జరగగా అభిషేకాలు వంద వరకు జరిగాయి. అయితే ఉదయం నుంచి ఆలలయ ఇఓ. విసాగర్‌బాబు స్వతహాగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. తిరుమలేశుని సన్నిధిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ముగియటంతో అక్కడకు వచ్చిన భక్తులు శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధికి వస్తున్నారు. అంతేకాక వరుస సెలవులతో భక్తుల తాకిడి పెరుగుతుంది. ఎటు చూసినా భక్త జనమే అన్నట్లు మారింది. సన్నిధివీధి అంతా జన మయంగామారింది. ఓ వైపు కాలినడకన వచ్చే భక్తులు మరో వైపు వాహనాల రద్దీతో కిట కిట లాడింది. సామాన్యభక్తుల తిప్పలు వర్ణనాతీతంగా మారింది. ఆదివారం అధికారికంగా దేవస్థానం జారి చేసినసమాచారం మేరకు 25 వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు తెలిపారు. రాహుకేతుదోష నివారణ పూజలకు కూడా సుమారు 5వేలు వరకు జరిగినట్లు .. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వారాంతంలో తమిళనాడు, కర్నాటకలకు చెందిన భక్తుల సంఖ్య అదికంగా ఉంటుంది.అలాగే విఐపిలతాకిడి కూడా అధికంగానే ఉంటుంది. కానీ ఆలయానికి సమీపంలో జ్ఞాన ప్రసూనాంబ సదన్ పేరుతో 27 గదులు నిర్మించారు.అన్ని కారుచౌకగా ఇచ్చే ఏసిలు. అయితే గత కొంత కాలంగా ఈ గదులు కొన్ని ఆలయాధికారులు పంచుకోగా మరి కొన్ని చైర్మెన్ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి కేటాయిస్తున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు అధికారుల, ప్రోటోకాల్ వివిధ శాఖల ప్రోటోకాల్ ముసుగులో గదులు కేటాయించుకున్నట్లు తెలిసింది.దాంతో వచ్చే భక్తులు,విఐపిల పరిస్తితి ఆగమ్యగోచరంగా మారింది.రోజుకొక నిబంధనలతో గందరగోళంగా మారుతుంది.

**నాలుగువేలు దాటిన రాహుకేతుదోష నివారణ పూజలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం రూ.200 దర్శనం టిక్కెట్లుతో 1520 మంది, రూ.50ల దర్శనం టిక్కెట్లులో 3724

## లెక్కకు మించి అభిషేకాలు

మంది రాహుకేతుదోష నివారణ పూజలకు సంబంధించి రూ.500లు టిక్కెట్లు 2708 మంది, రూ.750టిక్కెట్లతో 1158, రూ.1500 టిక్కెట్లు కొనుగోలు చేసిన 376 మంది భక్తులు రూ.2500ల టిక్కెట్లు కొనుగోలు చేసి 306 మంది, రూ.5వేల టిక్కెట్లు 93 కొనుగోలు చేసి పూజలు జరిపించుకున్నారు. కాగా అభిషేకాలు 93 శనీశ్వరాభిషేకాలు,మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాబిషేకాలు 27 శనీశ్వరాభిషేకాలు 6,నిత్యకళ్యాణ సేవల్లో 11 జరిగినట్లు సమాచారం అందించారు.

విశేష సంఖ్యలో అభిషేకాలు:

శివయ్య అభిషేక ప్రియుడంటారు.సోమవారం రోజు ఆలయంలో నిర్వహించే రుద్రాభిషేకాలకు భక్తులు కిట కిట లాడుతారు.ఉదయం రాహుకాల సమయంలో అభిషేకాలంటే భక్తుల సందడి చోటు చేసుకుంటుంది. ఈ నేపధ్యంలో సోమవారం రికార్డు స్థాయిలో 93 లు అభిషేక టిక్కెట్లు జారి చేసారు. ఇక సాయంత్రం సంధ్యా సమ యంలో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించే సంప్రదాయంఈఆలయంలోఉంది.దీనికి27టిక్కెట్లుజారి చేసారు .కేవలం 10 మందిని అనుమతించాల్సిన చోట ఇంత మందిని అను మతించటంతో అభిషేక దర్శనం కూడ లఘుదర్శనంగా మారింది.

# తిరుపతి డివిజన్

## అలుపెరగని సేవా తత్పరుడు అంబలి స్వామి

లోబావి కాలనీలో పాలు సరఫరా

శ్రీకాళహస్తి,అక్టోబర్ 9 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలో సుమారు 30సంవత్సరాలుగా భక్తుల నుంచి బిక్షమెత్తి నిరుపేదలు, చిన్నపిల్లలు, పాదచారుల ఆకలి దప్పులను తీర్చటంలో అంబలి స్వామి సేవలు అనిర్వచనీయం.మొదట ఆయన లోబావిలో గోవులను పెంచుకుంటూ భరద్వాజేశ్వరనికి సేవలందిస్తూ ఇక్కడకు వచ్చే భక్తుల ఆకలిదప్పులను తీర్చేవారు.అయితే అప్పటి ధర్మకర్తల మండలి ఆయనను సందేహించారు.కొంత కాలం ఆయన హిమాలయాలకు వెళ్లి ఆశ్రమంలో గడిపారు.తరువాత తిరిగి వచ్చి ఆయన వేయిలింగాల కోనలో గోశాలను ఏర్పాటు చేసారు.అలాగే దేవస్థానం టూరిస్టు బస్టాండు సమీపంలో చిన్న పాక ఏర్పాటు చేసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.నేడు వందలాది మందికి ఇక్కడ భోజనం ఏర్పాటు చేస్తున్నారు.ఓ వైపు పాదచారులు, బిక్షగాళ్ళకు భోజన సదుపాయాలు కల్పిస్తున్న అంబలి స్వామి ఉదయం సాయంత్రం చిన్న పిల్లలకు పాలను సరఫరా చేస్తున్నారు.సమీపంలోని లోబావి బిసి కాలనీ పిల్లలతో పాటు దేవస్తానానికి వచ్చిన పసి పిల్లలకు కూడా ఉచితంగా పాలను సరఫరా చేస్తున్నారు.

## ప్రజల జీవితాలతో పారిశుద్య చెలగాటం



-బంగారమ్మకాలనీలో లోపించిన పారిశుద్యం

తొట్టంబేడు, అక్టోబర్ 9 ప్రభాతవార్త

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్యం అద్వాన్నంగా తయారైంది. పారిశుద్యంపై ప్రత్యేకంగా శ్రద్దతీసుకుని ప్రజారోగ్యాని కాపాడాల్సిన పంచాయతీ కార్యదర్శులు కేవలం కార్యాలయాలకు పరిమితమవుతున్నారు. మండలకేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న బంగారమ్మ కాలనీలో సుమారు 150కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్నారు. ఒక్కసారి ఈ కాలనీలో పారిశుద్యంను పరిశీలిస్తే అధికారులు ఏమాత్రం చర్యలుతీసుకుం టున్నారో అర్థమవుతోంది. తొట్టంబేడు పంచాయతీ పరిధిలో ఈదులగుంట, బంగారమ్మకాలనీలు వస్తాయి. ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో పాలకులు, అధికారులు పనితీరు ప్రజలకు శాపంగా మారాయి. దీంతో రోడ్లు వేసినా డ్రైనేజీ కాలువలు నిర్మించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఇంటి నుంచి మురుగునీరు వెళ్ళాలంటే కాలువలు లేకపోవడంతో పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశాల్లో వదలడంతో దోమలకు నిలయాలుగా మారి కాలనీ వాసులు జ్వరాల బారిన పడుతున్నారు. ఇక ఇళ్ళ ముందే పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శులు ప్రజల నుంచి పన్నులు వసూలు చేయడంలో చూపించిన శ్రద్ద ప్రజారోగ్యంపై చూపించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఏ ఇంటి ముందు చూసినా మురుగునీరు పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశాల్లో చేరడం గమనించ వచ్చును. కాలనీ వాసులు పలుమార్లు ఇక్కడి అవస్థలపై సంబంధిత ఎంపిడిఓకు, పంచాయతీ కార్యదర్శు లకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందులు ఇళ్ళ ముందే సంచరి స్తుండడతో ఇబ్బందులకు గురవుతున్నామంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు బంగారమ్మ కాలనీలో పారిశుద్యంపై ప్రత్యేక శ్రద్ద చూపాల్సిన అవసరం ఉంది..

## రాష్ట్ర సాధికార సమితి సభ్యులకు సత్కారాలు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త



తెలుగుదేశంపార్టీ స్థాపన ద్వారా స్వర్గీయ నందమూరి తారకరామారావు నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి, చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావడానికి మరియు తెలుగుదేశంపార్టీకి బిసిలు వెన్నుదన్నుగా నిలవడానికి బిసి సాధికార సమితి సభ్యులు తీవ్రంగా కృషి చేయాలని రాష్ట్ర బిసి సాధికార సమితి సభ్యులుగా నియమితులైన మిన్నల్‌రవి మరియు కన్నావరం హరిబాబులను ఆదివారం రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్‌గుమ్మిడిపూడి దశరధాచారి, రెడ్డివారిగురవారెడ్డిలు కోరారు. ఈసందర్భంగా రాబోవు ఎన్నికల్లో బిసిలు తెలుగుదేశంపార్టీ నాయకత్వాన్ని బలపరుస్తూ ముందుకెళ్ళాలని కోరారు. అనంతరం మిన్నల్‌రవి, హరిబాబులను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు వాకచర్లగుర్రప్పశెట్టి, టిఎన్ఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి బిజె.ప్రసాద్, తిరుపతి పార్లమెంటు మహిళా నాయకురాలు చక్రాల.ఉష, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి, డిల్లీబాబు, భాస్కర్, ముదిరాజ్, మణి, సుబ్రమణ్యం, భార్గవ్‌నాయుడు, సునీల్, గోపాల్, సుజిత్‌రెడ్డి, అంకయ్య, ఆనంద్‌గౌడ్, షఫి, రాజేష్, మణి, సన్నీ, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ప్రసాదాల వితరణ

శ్రీకాళహస్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో బ్రహ్మర్షి ఓంకార స్వామి జీవసమాధి మఠాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు హాజరయి భక్తులకు ప్రసాదపంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానం చేయడం ఎంతో మంచిదని శివయ్య సన్నిధిలో భక్తులకు ప్రసాదాల వితరణ, అన్నదా నం చేయడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో మఠాలయం అర్చకులుతో పాటు ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు మురళీ, వైఎస్ఆర్‌సిపి నాయకులు ధన, మరియు భక్తులు పాల్గొన్నారు.

## బస్సును ఢీకొన్న ఆటో

-8మందికి స్వల్పగాయాలు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త



పట్టణంలోని ఎస్‌డికెనగర్‌లో వెళ్తున్న అక్సోరా పరిశ్రమకు చెందిన బస్సును ఎదురుగా వస్తున్న ఆటో వేగంగా వచ్చి ఢొకొనడంతో అందులో ప్రయాణిస్తున్న 8మంది స్వల్ప గాయా లతో బయటపడ్డారు. ఇదేమార్గంలో వెళ్తున్న టుటౌన్ పోలీసు సిబ్బంది మునీంద్ర, బాబులు స్పందించి వెంటనే 108కు సమాచారం అందించారు. దీంతో 108సిబ్బంది హరీష్‌రెడ్డి వారి సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించారు. వి.సుబ్రమణ్యం(18), పి.చందన(10), వి.నవ్య(16), పి.హేమలత(16), పి.వెంకటకార్తీక్(10), పి.కల్పన(35), పి.బాబు(45), డ్రైవర్ ఇ.మణి(40)లు స్వల్పంగా గాయపడ్డారు. వీరికి ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాధమిక చికిత్స చేశారు. టుటౌన్ పోలీసు సిబ్బంది మునీంద్ర, బాబులు స్పందించిన తీరును హర్షించారు.

## ఎంపిపి మోహిత్‌రెడ్డికి తిరుచానూరులో ఘనస్వాగతం

తిరుచానూరు,అక్టోబర్ 9 ప్రభాతవార్త



చంద్రగిరి ఎమ్మెల్యే డా॥చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు,తిరుపతి రూరల్ మండల పరిషత్ అధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తలపెట్టిన మహా పాదయాత్రకు తిరుచానూరు గ్రామ సర్పంచ్ రామచంద్రారెడ్డి మద్దతు తెలియచేశారు. 3వ రోజు పాదయాత్రలో భాగంగా ఆదివారం తిరుచానూరు పంచాయితీ పరిధిలోకి పాదయాత్రగా వచ్చిన మోహిత్‌రెడ్డికి ఆయన బ్రాహ్మణపట్టు ఎంపిటిసి బి.యోగానందరెడ్డి, ముళ్లపూడి సర్పంచ్ సురేష్‌రెడ్డి, తిరుచానూరు వార్డు మెంబర్ మునేంద్ర రాయల్, వైసిపి నాయకులు వెంకీ,వాసు,తదితరులతో కలిసి ఘన స్వాగతం పలికారు.

# పేదరికం సమూలంగా నిర్మూలించడమే జగన్ లక్ష్యం

## రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కె రోజా

నింద్ర, అక్టోబరు 9 ప్రభాతవార్త :



రాష్ట్రంలోని పేదరికం సమూలంగా నిర్మూలించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కె రోజా తెలిపారు. ఆదివారం మండలంలోని మేళంబాకం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి రోజా పర్యాటించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైయస్ కాంగ్రెసు పార్టీ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలలో ఇచ్చిన వాగ్దానాలలో 98శాతం అమలు చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని తెలిపారు. కులం,మతం,ప్రాంతం,పార్టీలకు ఆతీతంగా ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు అందజేస్తున్నమని అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా విచారించారు.ఎక్కడ అవినీతి తావులేకుండా పేద ప్రజలకు చేరవలసిన పథకాలు నేరుగా డిబిటి పద్దతిలో అందజేసిన ఘనత వైయస్‌ఆర్ కాంగ్రెసు పార్టీ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అబివృద్ధి చెందాలని వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజదానులు తీసుకొని వస్తా వుంటే ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబునాయుడు 29 గ్రామాలే రాజధాని అని రియల్ ఎస్టేట్ వ్యాపారస్థులకు మద్దతు తెలుపుతున్నారని విమర్శించినారు. ఆమెకు గ్రామంలో హారతులు ఇచ్చి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో యంపిపి దీపాజలంధర్‌రాజు మండల వైకాపా కన్వీనర్ వేణురాజు,యంపిడిఓ వేణు,తహాశీల్దారు అమరేంద్రబాబు,హౌసింగ్ ఎఇ శ్రీధర్‌రాజు, పంచాయితీరాజ్ ఎఇ వీరభద్రం,యంపిటిసి విజేష్,సింగల్ విండో చేర్మన్ మునిక్రిష్ణారెడ్డి,వైకాపా రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్,కో ఆప్షన్ మెంబర్ అనిల్,నాయకులు రమణరాజు, మహేష్,బాబురెడ్డి, నామాదేవరెడ్డి, మురళీనాయుడు, సుధాకర్, సత్యరాజ్, దామోదర్,వీరయ్య నాయుడులు పాల్గొన్నారు.

# వాల్మీకి మహర్షికి ఘన నివాళి

చిత్తూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జెసీ

వాల్మీకి మహర్షికి జయంతిని పురస్కరించుకుని ఆదివారం కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి ఒకే మాట ఒకే బాణం ఒకే పత్ని అని రామ లక్ష్మణులను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో రామాయణ మహా కావ్యాన్ని అందరికి అర్థమయ్యేలా చేరవేశారన్నారు. అంత గొప్ప రచనలు చేసిన వాల్మీకిని మహర్షిగా కీర్తించబడడం జరిగిందన్నారు. ఒక పండితుని ఇంట్లో జన్మించిన ఆయన ఒక బోయవాడికి చిక్కి వేటగాడిగా జీవిస్తూ తనకు వున్న పట్టుదలతో రామాయణ మహా కావ్యాన్ని రాశారన్నారు. రామాయణంలో దాదాపు 24 వేల శ్లోకాలను ఏకదాటిగా లిఖించిన ఘనం వాల్మీకికే దక్కుతుందన్నారు. ఈకార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మవారి దర్శనానికి క్యూకట్టిన భక్తజనం



బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 9 ప్రభాతవార్త

రాష్ట్రంలోనే శక్తిక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ ఆదివారం భక్తజన సంద్రమైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి దర్శనార్థం క్యూలైన్లలో యాత్రీకులు వేచివున్నారు. కొండ దినాన్ని పురష్కరించుకొని అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయాన్నే అమ్మవారికి విశేష అభిషేకం, అలంకరణ నిర్వహించారు. ఛేర్మన్ మిద్దింటి శంకరనారాయణ, ఇఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో అధికార, అర్చక, సిబ్బంది యాత్రీకులకు సేవలందించారు.

# అర్ధగిరిలో వైభవంగా పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె, అక్టోబర్ 9 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ప్రతి నెలా ఆలయంలో పౌర్ణమి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఆలయ ఛైర్మన్ పి.సురేంద్రారెడ్డి, ఈఓ నూకా వెంకట సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి స్వామివారికి ప్రాకారోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు అలంకరించిన స్వామివారిని ప్రత్యేక పల్లకిపై వుంచి ఆలయం, సంజీవరాయని పుష్కరిని చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఈసందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ పి.సురేంద్రారెడ్డి, ఈఓ సుబ్బారెడ్డి, పాలకమండలి సభ్యులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# వరసిద్దుని సేవలో ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్



కాణిపాకం, అక్టోబర్ 9 ప్రభాతవార్త:

ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ మల్లిఖార్జునరెడ్డి ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. మంత్రి వెంట చిత్తూరు వన్‌డిపో మేనేజర్ కృష్ణమూర్తి, స్థానిక ఎస్సై మనోహర్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాణిపాకంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



కాణిపాకం, అక్టోబర్ 9 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి అలయంలో ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. శనివారం వారంతపు రోజు కాగా ఆదివారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా భక్తులు స్వామివారికి మొక్కుబడులు తీర్చుకునేందుకు కాణిపాకం ఆలయానికి పెద్దఎత్తున తరలివచ్చారు. అలాగే కలియుగ వైకుంఠం తిరుమలలో కూడా భారీ స్థాయిలో రద్దీ కొనసాగుతుండడంతో అక్కడ తీర్థజనం కూడ కాణిపాకం స్వామివారి దర్శనార్థం తరలిరావడంతో ఉదయం నుండి రాత్రి వరకు భక్తుల రద్దీతో కాణిపాకం ఆలయం కిక్కిరిసింది.



గుంటూరు, చెన్నై, ఏలూరు విట్‌లలో అంతరిక్ష వారోత్సవాలు

# జోరువానలో...అల్లంతదూరాన

## -గోవిందా నీదర్శనమేదీ స్వామీ అంటున్న భక్తులు





తిరుమల,అక్టోబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:

వారాంతపుసెలవులు....పెరటాసిమాసం వెరసి కురుస్తున్న జోరువానలో అల్లంతదూరంగా ఉన్న క్యూలైన్లలో గోవిందుని దర్శనానికి భక్తులు అవస్థలు పడుతున్నారు. ఆదివారం ఉదయం కూడా తిరుమలకు భక్తులు భారీగా చేరుకున్నారు. సర్వదర్శనంలో 24గంటలు సమయం నిరీక్షిస్తున్నారు. ఈ రద్దీ మరో రెండురోజులు కొనసాగే అవకాశం ఉంది. ఆదివారం సాయంత్రం వరకు భక్తుల రద్దీ వెలుపల క్యూలైన్లలోనే కొనసాగుతోంది. సాయంత్రం వరకు 57వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

# పెరటాసి మాసం అంకమ్మ పొంగళ్ళు



శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 9 ప్రభాతవార్త

తిరుపతిజిల్లాలోని ప్రముఖ శైవ ఆధ్యాత్మిక క్షేత్రంగా ప్రసిద్ది చెందిన శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని గ్రామాల్లో ధార్మిక కార్యక్రమాలతో పునీతమౌతున్నాయి. ఈ నేపథ్యంలో పెరటాసి నెలలో గ్రామాల్లో అంకమ్మ పొంగళ్లు నిర్వహించటం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఆదివారం శ్రీకాళహస్తి మండలంలోని చెర్లోపల్లితోపాటు ఏడు గ్రామాల్లో అంకమ్మ పొంగళ్ళు నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామ పొలిమేరల్లో వెలసిన అంకమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి చోటు చేసుకుంది. మహిళలు విశేష సంఖ్యలో పొంగళ్ళు పెట్టారు. మొక్కులు తీర్చుకున్నారు. ఇక్కడ అంకమ్మ ఆలయాన్ని నిర్మించారు.ఈ ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు.ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసారు.ఆలయాన్ని విద్యుత్‌దీపాల తోరణాలతో అలంకరించారు.ఆలయం వద్ద విద్యుత్ దీపాల అమ్మవారిని రూపొందించారు.శ్రీరామనవమి సందర్భంగా గ్రామాల్లోని రామ మందిరాల వద్ద 15 నుంచి 20 రోజుల వరకు ఉభయాలను బట్టి ఉత్సవాలు నిర్వహిస్తారు. తరువాత పాండురంగస్వామి తిరునాళ్ల నిర్వహిస్తారు.ఇలా ధార్మిక కార్యక్రమాలకు శ్రీకాళహస్తి నిలయంగా మారింది. అమ్మవారికి భారీ ఎత్తున మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి కుటుంబం నుంచి అమ్మవారికి పొంగళ్ళు జరిపారు.

పవిత్రమ్మ దర్శనం:

శ్రీకాళహస్తి మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన అంకమ్మ కొలుపు కార్యక్రమాల్లో శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి తనయ బియ్యపు పవిత్రారెడ్డి హాజరయ్యారు. ఆమెకు శ్రీకాళహస్తి పాలసరఫరా సంఘం చైర్మెన్ మధుసూధననాయుడు స్వాగతం పలికి అమ్మవారి సన్నిధిలో పూజలు జరిపి ఆశీర్వదించారు.

# మోహిత్‌రెడ్డి పాదయాత్రలో ఎమ్మెల్యే చెవిరెడ్డి



తిరుపతిరూరల్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మంగళంలో నిర్వహిస్తున్న గడప గడపకు పాదయాత్రలో ఆదివారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. గత మూడురోజులుగా ఎంపిపి మోహిత్‌రెడ్డి శేషచలనగర్, తిరుమలనగర్, మంగళం క్వార్టర్స్ తదితర ప్రాంతాలలో పాదయాత్ర చేస్తున్న విషయం విదితమే. గడప గడపకు కార్యక్రమంలో మోహిత్‌రెడ్డి ప్రతి ఇంటికి వెళ్తూ సంక్షేమ పథకాల వివరాలను అందజేస్తూ ముందుకు సాగారు. మంగళం క్వార్టర్స్‌లో కిడ్నీ బాధితురాలుకి మెరుగైన వైద్యం అందించాలని స్విమ్స్ వైద్య అధికారులను ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆదేశించారు. గడప గడప పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే చెవిరెడ్డికి కర్పూర హారతులతో ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల జాబితాను లబ్దిదారులకు అందిస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో ఉప మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి, కళలు, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ చిలమంద మునికృష్ణ, ఎంపిటిసి నారాయణరెడ్డి, శివరాజు, చిలమంద హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా ఊంజల్ సేవ




శ్రీకాళహస్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని ఊంజల్ సేవను ఆదివారం రాత్రి ఆలయంలోకన్నుల పండువగా సాగింది. సాయంత్రం ఆలయ ఆవరణలోని అలంకార మండపంలో కన్నులపండువగా అలంకరించి నాలుగుకాళ్ళ మండపంలో అమ్మవారిని, కోట మండపంలో సోమాస్కందమూర్తి అయిన శ్రీకాళహస్తీశ్వరున్ని ప్రతిష్టించి ఊంజల్ సేవను నిర్వహించారు. ప్రతి పౌర్ణమి నాడు ఆలయంలో ఊంజల్ సేవ ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించడం ఆనవాయితీ. .ఊంజల్‌సేవను ఆలయ పూజలతో ప్రారంభించారు.ప్రతినెలా పౌర్ణమిరోజున ఎంతో కన్నులపండువగా నిర్వహించే ఊంజల్‌సేవలో ఆలయ ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులతో పాటు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రత్యేకాహ్వానితులు పాల్గొన్నారు. ఏర్పాట్లును ఆలయ ఎస్ఆర్.కృష్ణారెడ్డి, అధికారులు పర్యవేక్షించారు. రెండు మండపాల్లో ప్రత్యేకంగా స్వామి అమ్మవార్ల కోసం తయారు చేసిన ఊయల్లో ప్రతిష్టించి ఉత్సవం నిర్వహించారు. ఊంజల్‌సేవలో భక్తులు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# సింహ వాహనంపై శ్రీ రాజరాజేశ్వరీ అలంకరణలో ఎల్లమ్మ



చంద్రగిరి, అక్టోబర్ 9 ప్రభాతవార్త:

సత్యప్రమాణాలకు నెలవైకొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారు శ్రీ రాజరాజేశ్వరీ అలంకరణలో సింహ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ దేవీ నవరాత్రి మహోత్సవాలను ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, తిరుపతి జిల్లా దేవాదాయ శాఖ అధికారి, ఆలయ ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఆలయ అర్చకులు సూరి స్వామి అమ్మవారికి వేకువజామున అభిషేకం జరిపించారు. సాయంత్రం 7 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని వేంచేపుగా ఆలయ పడికావలికి తీసుకువచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని వివిధరకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలకు విశేష అలంకరణ గావించి శ్రీరాజరాజేశ్వరీ అలంకరణలో సింహ వాహనంపై అధిష్టింపజేశారు. ఈ వాహనసేవకు చంద్రగిరికి చెందిన రిటైర్డ్ టీచర్ పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, సంతప్లి జయపాల్ రెడ్డి, టి.రవికుమార్ రెడ్డి, నాగాతం సుమన్‌కుమార్, రామిరెడ్డిపల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, మల్లయ్యపల్లికి చెందిన పసుపుల దేవరాజులు, అగరాలకు చెందిన తూకాకుల జయచంద్రారెడ్డి దాతలుగా వ్యవహరించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బ్యాండుబాజాల నడుమ భక్తుల భజనలతో అమ్మవారి వాహనసేవ కన్నుల పండువగా సాగింది. కాగా ఈ నెల 3న నిర్వహించవలసిన సింహ వాహన సేవ అనివార్య కారణాలతో రద్దు చేయగా, ఆదివారం నిర్వహించారు.

# కాణిపాకంలో శాస్త్రోక్తంగా సత్యనారాయణవ్రతం

కాణిపాకం, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి ఆలయంలో ఆదివారం సత్యనారాయణ వ్రతంను శాస్త్రోక్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఈవ్రతాన్ని నిర్వహించారు. ఆలయ మండపంలో ఈవ్రతాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ మండపంలో వుంచి సత్యనారాయణవ్రతంను నిర్వహించారు. ఈసందర్భంగా సత్యనారాయణస్వామి వ్రత మహత్యాన్ని అర్చకులు భక్తులకు వివరించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. అలాగే రాత్రి అలంకరించిన స్వామి, అమ్మవార్లను గరుడవాహనం వుంచి గరుడ సేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ఆమడదూరంలో..తమ్మిరెడ్డిపల్లె..!

## తరాలు మారినా తలరాతలు మారడం లేదని గ్రామస్తులు ఆవేదన



గ్రామ నడి ఒడ్డున చెరువును తలపిస్తున్న మురుగు నీటికుంట , పక్కా గృహం లేక పాకలో నివాసం ఉంటున్న దృశ్యం

గంగవరం, అక్టోబర్ 9, ప్రభాతవార్త :

మండలంలోని తమ్మిరెడ్డిపల్లె గ్రామం ఎటువంటి అభివృద్ధికి నోచుకోక గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేక అత్యవసర పరిస్థితుల్లో ఆ గ్రామ ప్రజలు అనేక అవస్థలు పడుతూ జీవనం సాగిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనం కూడా ఆ గ్రామానికి వెళ్ళలేక పోతుందంటే ఆ గ్రామానికి వెళ్ళే రహదారి ఎంత శిథిలావస్థలో ఉందో అర్థం అవుతుంది.వివరాల్లోకి వెళితే...గంగవరం మండల పరిధిలోని తాళ్ళపల్లె పంచాయతీ తమ్మిరెడ్డిపల్లె గ్రామం అభివృద్ధికి నోచుకోక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది.కనీస సౌకర్యాలైన త్రాగునీరు,పరిసరాలపరిశుభ్రత ప్రజలకు దూరంగానే ఉన్నాయి.ఇక రహదారి చెప్పనవసరం లేదు.వర్షాకాలం మొదలు జూలై నెల నుండి డిశంబర్ నెల వరకు ఆ గ్రామ ప్రజలు మండల కేంద్రానికి రాక పోకలు సాగించాలంటే నరకయాతను అనుభవిస్తున్నారు.గ్రామంలో సుమారు 150 కుటుంబాలు నివసిస్తుండగా 600 మంది జనాభా కలిగి ఉంది. అలాంటి గ్రామంలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.గతంలో రక్షిత మంచినీటి పథకం ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన మంచి నీరు అందించాలనే దృక్పథంతో గతంలో ప్రభుత్వం లక్షలు రూపాయలు ప్రజా ధనం వ్యచించి సుమారు 15 సంవత్సరాల క్రితం ట్యాంక్ నిర్మించింది.అయితే వాటర్ ట్యాంక్‌కు పైపులైన్ వేయకపోవడంతో ఇప్పటి వరకు నీటి సరఫరా లేకనే గ్రామంలో అలంకార ప్రాయంగా నిలిచి చివరకు శిథిలావస్థకు చేరుకుంది.గ్రామంలోఎటు చూసిన పారి శుద్ధ్యం అద్వానంగా,మురుగు నీటి కుంటలు, పేడ దిబ్బలతో దుర్వాసన వెదజల్లు తుంది. గ్రామంలో మురుగు నీటి కాలువలు లేకపోవడం,గ్రామ నడి ఒడ్డున చెరువుని తలపించేలా మురుగునీటి కుంట ఉండడంతో దోమలు విజృంబించి అంటు వ్యాధులకు మూలమవుతున్నాయి.ఇక రాష్ట్ర ప్రభుత్వం గుడిసె రహిత రాష్ట్రంగా చేయాలని ప్రయత్నిస్తుంది. అర్హులందరికీ రాజకీయాలకుఅతీతంగా పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని హామీలు ఇస్తున్న వాస్తవంగా కింది స్థాయిలో అమలు కావడం లేదు.గ్రామానికి చెందిన కాంతమ్మ అనే మహిళ టెంకాయ కీతులతో పశువుల పాకలాంటి కొట్టంలో తన కుటుంబ సభ్యులతో కలిసి దుర్బర స్థితిలో నివాసం ఉండడమే నిదర్శనం.తరాలు మారినా తలరాతలుమాత్రం మారడంలేదని గ్రామస్తులుఆవేదనవ్యక్తం చేస్తున్నారు.